# గురుకులంలో ఫుడ్‌పాయిజన్

## కరీంనగర్ శర్మనగర్ విద్యాలయంలో 31 మంది విద్యార్థినులకు అస్వస్థత



కరీంనగర్ ప్రధాన దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 7: కరీం'నగరం'లోని శర్మనగర్ మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకులంలో సోమవారం రాత్రి ఫుడ్ పాయిజన్‌తో 31 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో అర్ధరాత్రి నుంచే బాధపడుతుండగా, వసతి గృహ అధికారి, సిబ్బంది వారిని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు ఆందోళనకు గురై, రోదిస్తూ దవాఖానకు చేరుకున్నారు. చికిత్స అనంతరం పిల్లలు కోలుకోవడం, ప్రమాదం ఏమీ లేదని వైద్యులు ప్రకటించడంతో తల్లిదండ్రులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సాయంత్రం కల్లా విద్యార్థినులను హాస్టల్‌కు తరలించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో అస్వస్థతకు గురైన వారికి అనారోగ్య సెలవులు ఇచ్చి, ఇండ్లకు పంపించారు. ఈ ఘటనపై విద్యార్థి సంఘాల నాయకులు గురుకులం ఎదుట ఆందోళన చేశారు.



రోదిస్తున్న విద్యార్థిని తల్లి



తల్లితో కలిసి ఇంటికి వెళ్తున్న విద్యార్థిని


## కాంగ్రెస్ నాయకుల కబంధ హస్తాల్లో

# అసైన్డ్ భూములు ?



- ప్రతి మండలంలోనూ ఇదే దందా
- 2004 నుంచి 2014 వరకు చక్రం తిప్పిన 'హస్తం' నాయకులు!
- ఆ పై రికార్డుల్లో నమోదు
- బినామీ పేర్లతో కొంత మంది కైవసం
- బయట పడుతున్న బాగోతం
- ఇప్పుడేమంటారో హస్తం పార్టీ నేతలు
- ఆ నాయకులను అరెస్ట్ చేస్తారా.. ఉపేక్షిస్తారా..?
- అధికారుల ముందు సవాళ్లు


కాంగ్రెస్ నాయకుల కబంధ హస్తాల్లో ఎకరాల కొద్దీ అసైన్డ్ భూములు చిక్కుకున్నాయి. చాలా మంది నాయకులు సదరు ఆస్తులను ఏళ్లకేళ్లుగా అనుభవిస్తున్నారన్న విమర్శలున్నాయి. 2004 నుంచి 2014 వరకు ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆ ల్యాండ్స్‌ను కాజేసినట్టు బయటపడుతున్నది. గుట్టుచప్పుడు కాకుండా రికార్డుల్లో పేర్లు రాయించుకొని పట్టాదారు పాసు పుస్తకాలు పొందడమే కాదు, కొంత మంది ఏకంగా క్రయవిక్రయాలు చేసినట్టు తెలుస్తున్నది. అయితే సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు తప్పుడు రికార్డుల ద్వారా అసైన్డ్ భూములు ఆక్రమించుకున్నారంటూ అరెస్టులు చేస్తున్న విషయం తెలిసిందే. అంతేకాదు, అరెస్టుల పరంపర ఇంకా కొనసాగుతుందనే సంకేతాన్ని అధికార పార్టీ నాయకులు ఇస్తున్నారు. అలాగే ఎకరాల కొద్దీ అసైన్డ్ లాండ్స్‌ను బీఆర్ఎస్ నాయకులు ఆక్రమించుకున్నారంటూ ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లేలా కుట్రలు చేస్తున్నారు. నిజానికి లోతుగా వెళ్తే ఎంతో మంది హస్తం నాయకులు అసైన్డ్‌ను చెరపట్టారు. ఒకటి రెండెకరాలు కాదు, ఏకంగా ఐదెకరాలను కూడా కైవసం చేసుకున్న నాయకులున్నారు. అసైన్డ్ భూములను ఎంచక్కా అనుభవిస్తున్న పలువురు కాంగ్రెస్ నాయకుల జాబితా 'నమస్తే తెలంగాణ' సంపాదించింది. వాటిని ప్రజలకు తెలుపడమే లక్ష్యంగా వివరాలు బహిర్గతం చేస్తున్నది. ఇవి మచ్చుకే అయినా.. లోతుగా వెళ్తే ఇంకా చాలా మంది అసైన్డ్ భూముల దందా బయటపడుతుంది.


Search By
Survey No./ Sub-Division No. | Pattadar Passbook Number
District | Mandal | Village
Survey No./ Sub-Division No. | Khata No.
BVY9X | Fetch | Reset
Land Details
District: Rajanna Sircilla | Mandal: Thangallapalli | Village: Sarampalle
Khata Number: 503 | Survey No./ Sub-Division No.: 338/24 | Pattadar Name
Father / Husband's Name | Caste Category: BC-B | Gender: Male
Total Extent (Ac. Gts): 5.0000 | Nature of Land: Lavani Patta | Classification of Land: Mettar Dry
Market value of Survey no.(in INR): 450000 | Land Status: Digital Signed | Land Type: Assigned Land
Transaction Status: Survey no / Sub-division is marked as Assigned Lands | eKYC Status: Aadhaar available & e-KYC completed

ఎల్లె లక్ష్మీనారాయణ ధరణి రికార్డు



> సిరిసిల్లకు చెందిన ఇతని పేరు ఎల్లె లక్ష్మీ నారాయణ. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు. రెండు సార్లు సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్. గతంలో ఆ పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్. ఆయన పేరుపై తంగళ్లపల్లి మండలం సారంపల్లిలోని సర్వేనంబర్ 338/24లో ఐదెకరాల అసైన్డ్ స్థలం ఉన్నది.


District: Rajanna Sircilla | రాజన్నసిరిసిల్ల
Mandal: Thangallapalli | తంగళ్లపల్లి
Village: Oblapur(Pk) | ఒబులాపూర్ (పి.కె.)
Khata Number: 1295
Survey No./ Sub-Division No.: 368/1/24
Pattadar Name: సంగీతం విద్య / సంగీతం విద్య
Father / Husband's Name: శ్రీనివాస్ / శ్రీనివాస్
Caste Category: BC-B
Gender: Female
Total Extent (Ac. Gts): 3.2000
Nature of Land: Lavani Patta
Classification of Land: Mettal Dry
Market value of Survey no.(in INR): 337500
Land Status: Digital Signed
Land Type: Assigned Land
Transaction Status: Survey no / Sub-division is marked as Assigned Lands
eKYC Status: Aadhaar available & e-KYC completed

సంగీతం శ్రీనివాస్ సతీమణి సంగీతం విద్య పేరిట ఉన్న ధరణి రికార్డు



> సిరిసిల్లకు చెందిన ఇతని పేరు సంగీతం శ్రీనివాస్. ప్రదేశ్‌కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కో–ఆర్డినేటర్. కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణాధ్యక్షుడు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూడా. ఆయన సతీమణి సంగీతం విద్య పేరిట తంగళ్లపల్లి మండలం ఒబులాపూర్ (పి.కె.)లో సర్వేనంబర్ 368/1/24 ఖాతా నంబర్ 1295లో 3 ఎకరాల 3 గుంటల అసైన్డ్ స్థలం ఉన్నది.

కరీంనగర్, జనవరి 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : చట్టం అనేది అందరికీ ఒకేలా ఉంటుంది. అదే నిజమైతే అసైన్డ్ ల్యాండ్ పేరిట బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేస్తున్న మాదిరిగానే కాంగ్రెస్ నాయకులను కూడా అరెస్ట్ చేయాలన్న డిమాండ్ వస్తున్నది. 2004 నుంచి 2014 సమయంలో చాలా మంది 'హస్తం' నాయకులు అసైన్డ్ భూములను చెర పట్టినట్టు తాజాగా లభిస్తున్న ఆధారాలు, రికార్డులను బట్టి తెలుస్తున్నది. ఒకటి రెండెకరాలు కాదు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సిరిసిల్ల మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పేరున ఐదెకరాల అసైన్డ్ ల్యాండ్ ఉన్నది. అలాగే కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్ సతీమణి పేరిట మూడెకరాల పైచిలుకు అసైన్డ్ ల్యాండ్ ఉన్నది. ఇవి మచ్చుకు మాత్రమే! నిజానికి లోతుగా వెళ్తే మెజార్టీ గ్రామాల్లోని అసైన్డ్ ల్యాండ్స్ కాంగ్రెస్ నాయకుల చేతుల్లోనే ఉన్నట్టు తెలుస్తున్నది. అంతే కాదు, సిరిసిల్ల చుట్టుపక్క గ్రామాల్లో అత్యంత విలువైన మెజార్టీ భూములు సైతం వీరి చెరలోనే ఉన్నట్టు తెలుస్తున్నది. నిజానికి కొంతమంది స్వచ్ఛందంగా అసైన్డ్ భూములను తిరిగి ఇచ్చినట్టు అధికారులు చెబుతున్నా.. అందులో ఇప్పటివరకు ఉన్న సమాచారం ప్రకారం చూస్తే ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు తనకున్న అసైన్డ్ స్థలాన్ని తిరిగి ఇవ్వలేదు. అలాగే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ 250 ఎకరాల వరకు ప్రభుత్వ స్థలాలను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించినా.. అందులో ఎవరైనా కాంగ్రెస్ నాయకులున్నారా.. లేరా..? అన్న వివరాలు మాత్రం ఇంకా వెలుగు చూడలేదు. కేవలం బీఆర్ఎస్ నాయకులను మాత్రమే ఎందుకు అరెస్ట్ చేస్తున్నారన్న ప్రశ్నలకు ఇన్నాళ్లు అధికారులు, హస్తం నాయకులు చెబుతున్న సమాధానం ఒక్కటే! బీఆర్ఎస్ నాయకులే అసైన్డ్ భూములను కాజేశారని, అందుకే అరెస్ట్ చేస్తున్నామన్నా.. ఇప్పుడు మాత్రం కాంగ్రెస్ నాయకుల బాగోతం ఒక్కొక్కటిగా బయట పడుతున్నది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేస్తారా..? లేక ఉపేక్షించి వదిలేస్తూ కేవలం బీఆర్ఎస్ నాయకులనే అరెస్టు చేస్తూ ముందుకెళ్తారా..? అన్నది మున్ముందు తేలనున్నది. అధికారులు ఇక ముందు తీసుకునే చర్యలను బట్టి.. వారు పక్షపాతంగా వెళ్తున్నారా..? లేక చట్టానికి లోబడి వెళ్తారా..? అన్నది కూడా స్పష్టం కానున్నది.

### చెరలో అసైన్డ్ భూములు.. సాక్ష్యాలివిగో..

- తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లెకు చెందిన పొన్నాల పరశురాములు ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. వీరి సోదరుల పేరిట నాలుగెకరాల అసైన్డ్ భూమి ఉన్నది. అందులో పొన్నాల శంకరవ్వ భర్త శంకరయ్య పేరిట రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఒబులాపూర్ గ్రామంలోని సర్వేనంబర్ 368/1/11 ఖాతా నంబర్ 1110పై రెండు ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నది. అలాగే పొన్నాల సుజాత భర్త బాలయ్య పేరిట సర్వేనంబర్ 368/1/10 ఖాతానంబర్ 1109పై రెండెకరాల స్థలం ఉన్నది.
- కాంగ్రెస్ పార్టీకి చెందిన మునిగెల బాలయ్య తండ్రి అంజయ్య పేరిట తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో ఖాతానెంబర్ 10, సర్వేనెంబర్ 464/3/1లో రెండెకరాల అసైన్డ్ స్థలం ఉన్నది.

> ఆ నలుగురి పేర్లపై ఉన్న ధరణి రికార్డులను పరిశీలిస్తే నేచర్ ఆఫ్ ల్యాండ్ కింద లావోని పట్టాగా చూపించారు. లావాదేవీల స్టేటస్‌లో మాత్రం ఈ సర్వే నంబర్లను, సబ్ డివిజన్ నంబర్లను అసైన్డ్ ల్యాండ్‌గా గుర్తించినట్టు నమోదు చేశారు.

# డెయిరీపై ఆరోపణలు వద్దు




మాట్లాడుతున్న కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు

- ఇది లక్షల మంది రైతు కుటుంబాలకు చెందిన సంస్థ
- రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపాం
- వినియోగదారుల నమ్మకాన్ని పెంచాం
- కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు

కరీంనగర్, జనవరి 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉన్న కరీంనగర్ డెయిరీపై ఆరోపణలు వద్దని, నిజానిజాలు తెలుసుకొని మాట్లాడాలని కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు సూచించారు. లక్షల మంది రైతు కుటుంబాలకు చెందిన సంస్థ అన్న విషయం మరిచి కొంత మంది తమ స్వార్థం కోసం లేనిపోని అపోహలు సృష్టించేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమ డెయిరీ నుంచి వచ్చే పాలు, ఇతర ప్రొడక్టుల విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. తప్పుడు ఆరోపణలను వినియోగదారులు పరిగణలోకి తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 12 డెయిరీలో రైతు కుటుంబాలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు కరీంనగర్ డెయిరీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ డెయిరీ క్వాలిటీలో రాజీ పడకుండా వినియోగదారుల మన్నలు పొందుతూ నేడు రాష్ట్రంలోనే ఆగ్రగామిగా నిలుస్తున్నదని చెప్పారు. కానీ, కొంత మంది పని గట్టుకొని మూడు నెలలుగా విష ప్రచారం చేస్తున్నారని ఆగ్రహించారు. డెయిరీ పరంగా ఏ తప్పు జరిగినా ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వ విభాగాలున్నాయని, ఇటీవల కొంత మంది డెయిరీపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ)కు ఫిర్యాదు చేశారని, అటువంటి వాటిని డెయిరీ పరంగా స్వాగతిస్తున్నామన్నారు. ఆ మేరకు సంబంధిత అధికారులు వచ్చి పరిశీలించి ఇచ్చిన సూచనలు అమలు చేశామని చెప్పారు. కానీ, కొంతమంది మాత్రం డెయిరీ పాలలో కెమికల్ కలుపుతున్నారని, నీళ్లు మిక్స్ చేస్తున్నారని, వినియోగిస్తున్న నీటితో చుట్టుపక్కల ప్రాంతాల్లో టీడీఎస్ పెరుగుతున్నదని, డెయిరీ నుంచి విష పదార్థాలు విడుదలవుతున్నాయని, తద్వారా చుట్టుపక్కల కాలనీల్లో చర్మవ్యాధులు వస్తున్నాయని, పిల్లలు వికలాంగులుగా పుడుతారని, అబార్షన్లు అవుతాయంటూ నోటికి వచ్చినట్టు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. వీటిని డెయిరీ పరంగా పూర్తిగా ఖండిస్తున్నామని ప్రకటించారు. కొంతమంది ప్రైవేట్ డెయిరీలతో కలిసి ఈ దుష్ప్రచారానికి ఒడిగడుతున్నట్టు పాలకవర్గం భావిస్తున్నదన్నారు. డెయిరీ చుట్టుపక్క ప్రాంతాలకు ఎటువంటి హాని లేకుండా అనేక రకాల చర్యలు తీసుకుంటున్నామని, పాలలో నీళ్లుగానీ, కెమికల్స్‌గానీ ఏమాత్రం కలుపడం లేదని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులతో శాస్త్రీయంగా పర్యావరణానికి ఎటువంటి హాని లేకుండా పాలు, పాల పదార్థాలు ప్రాసెస్ చేస్తున్నామని స్పష్టం చేశారు. బాయిల్ చిమ్నీ కూడా పీసీబీ సూచన మేరకు నడిపిస్తున్నామని, పాలు, ఇతర పదార్థాల తయారీ ప్రాసెస్ కోసం వినియోగించే నీటిని ఎంప్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఈటీపీ) ద్వారా శుద్ధి చేస్తూ తిరిగి డెయిరీ అవసరాలకు వినియోగిస్తున్నామని వివరించారు. డెయిరీ సిటీ సెంటర్‌లో ఉండడంతో చర్మరోగాలు వస్తున్నాయంటూ ఆరోపణలు చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లోని లాలాగూడ నడిబొడ్డున విజయ డెయిరీ ఉందని, అలాగే ఢిల్లీ, బెంగళూర్ నడిబొడ్డున డెయిరీలున్నాయని, అక్కడ లేని సమస్యలు ఇక్కడెలా ఉత్పన్నమవుతాయని, ప్రజలు ఒక్కసారి గమనించాలని విజ్ఞప్తి చేశారు. 1971లో ప్రారంభమైన డెయిరీ 1998 నాటికి నష్టాల బాట పట్టిందని, ఆ స్థితి నుంచి ఈరోజు రాష్ట్రంలో నంబర్‌వన్ స్థానానికి తెచ్చామని చెప్పారు. దీని వెనక పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధుల సహకారంతోపాటు అధికారులు, పాలకవర్గసభ్యులు, పాడి రైతులు, వినియోగదారులు, డెయిరీ సిబ్బంది సహకారం సంపూర్ణంగా ఉందన్నారు. ఆ ఫలితంగానే ఒకనాడు 12వేల లీటర్ల పాల సేకరణ జరిగిన డెయిరీలో ప్రస్తుతం 1.80 లక్షల లీటర్ల పాల సేకరణ జరుగుతున్నదని వివరించారు. అందులో విక్రయాలు, ప్రొడక్ట్‌ల ఉత్పత్తికి 1.50 లక్షల లీటర్ల పాల వినియోగిస్తున్నామని, ఇవిపోను దాదాపు 30వేల లీటర్లను మనం పౌడర్ తయారు చేయడానికి చిత్తూరుకు పంపుతున్నామన్నారు. నిజానికి గతంలో వివిధ దేవాలయాలకు పాలు, నెయ్యి మన డెయిరీ నుంచి పంపేవారని, ప్రభుత్వం జీవో ఇవ్వడం వల్ల ప్రస్తుతం దేవాలయాలకు విజయ డెయిరీ పాలు వెళ్తున్నాయన్నారు. తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ ప్రభుత్వానికి, సంబంధిత మంత్రికి, అధికారులకు విజ్ఞప్తి చేశామన్నారు. సమావేశంలో డైరెక్టర్లు నారాయణరెడ్డి, ప్రభాకర్‌రావు, ఎండీ శంకర్‌రెడ్డి, డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

> కరీంనగర్ డెయిరీ లక్షల మంది రైతు కుటుంబాలకు సంబంధించిన సంస్థ. వినియోగదారుల నమ్మకాన్ని పెంచుతూ ఇప్పుడు రాష్ట్రంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలబెట్టాం. నిరాధారమైన ఆరోపణలు డెయిరీ సేల్స్‌పై ప్రభావం చూపుతాయి. ఆ ప్రభావం పాడి రైతులపైనా పడుతుంది. అటువంటి డెయిరీపై బేస్‌లెస్ ఆరోపణలు చేయద్దు. డెయిరీ అభివృద్ధికి సహకరించాలి.
>
> - రాజేశ్వర్‌రావు

## 10న ఉద్యోగ మేళా

కరీంనగర్ కమాన్ చౌరస్తా, జనవరి 7: హైదరాబాద్‌లోని కేఎల్ టెక్నికల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో ఈ నెల 10న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్టు కరీంనగర్ జిల్లా ఉపాధి అధికారి వై తిరుపతి రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేఎన్ టెక్నికల్ సర్వీసెస్‌లో పలు విభాగాల్లో 50 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇందులో పదో తరగతి ఆపై పాస్ అయిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముకరంపురలోని ప్రభుత్వ ఈ–సేవ కేంద్రం పై అంతస్తులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగ మేళా ఉంటుందని చెప్పారు. వివరాలకు 70931 72221, 72076 59969, 99082 30384లో సంప్రదించాలని సూచించారు.



వేములవాడ: తెలంగాణ చౌక్ వద్ద అర్ధనగ్న ప్రదర్శనలో బీఆర్ఎస్ నాయకులు



చొప్పదండి: రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అడ్డుకుంటున్న పోలీసులు

## మాట మార్చిన కాంగ్రెస్‌పై

# భగ్గుమన్న బీఆర్ఎస్



జూలపల్లి: పొలంలో నాట్లు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు రఘువీర్‌సింగ్, కార్యకర్తలు


- రైతు భరోసా ₹15 వేలు ఇవ్వాల్సిందేనని డిమాండ్
- హామీ అమలు చేయకుంటే ప్రజలు తరిమికొడతారని హెచ్చరిక

చొప్పదండి, జనవరి 7 : రైతు భరోసా విషయంలో కాంగ్రెస్ సర్కారు రైతులను మోసం చేయడంపై బీఆర్ఎస్ పార్టీ భగ్గుమన్నది. మూడు రోజులుగా చేపడుతున్న ఆందోళనల్లో భాగంగా మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా రాస్తారోకోలు, ధర్నాలు, వినూత్న నిరసనలతో హోరెత్తించింది. ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేసింది. లేకుంటే కాంగ్రెస్‌ను ప్రజలు తరమికొడతారని హెచ్చరించింది. కరీంనగర్ జిల్లా చొప్పదండిలోని ఎన్టీఆర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత రైతులతో కలిసి పొలంలోకి దిగి నిరసన తెలిపారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్ల కండువాలు ధరించి మహిళా కూలీలు, రైతులు, కార్యకర్తలతో కలిసి పొలంలో వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. అనంతరం వాడవాడలా ద్విచక్ర వాహన ర్యాలీ తీసి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఇక్కడ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ పాల్గొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని తెలంగాణచౌక్‌లో వేములవాడ రూరల్ బీఆర్ఎస్ నాయకులు అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలిపారు.

### మళ్లీ రోడ్లెక్కే రోజులొచ్చినయ్

కాంగ్రెస్ పాలనలో అన్నదాతలు మళ్లీ రోడ్లెక్కే రోజులొచ్చాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై మాట తప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి. రాష్ట్రంలో ఒక్కో రైతుకు ఎకరాకు ₹17,500 చొప్పున రేవంత్‌రెడ్డి అప్పు ఉన్నారు. వాటిని ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలి? రైతుభరోసా కింద ఎకరానికి ₹15 వేలు ఇస్తానని చెప్పి ఈరోజు ₹12 వేలు మాత్రమే ఇస్తాననడం రైతులను మోసం చేయడమే. రైతు రుణమాఫీకి రాంరాం చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. 2014కు ముందు తెలంగాణ ఏవిధంగా ఉండేదో మళ్లీ ఆ రోజులను రైతులకు చూపిస్తున్నారు. ఆయన తప్పుడు పాలనను తిప్పికొడతాం. రైతుల ఆగ్రహాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. ఇందిరమ్మ రాజ్యంలో యూరియా కొరతతో రైతులు అరిగోస పడుతున్నారు. రైతు భరోసా, రుణమాఫీ, సాగు నీళ్లు, విద్యుత్ సరఫరా, రైతు ఆత్మహత్యలపై సమీక్ష నిర్వహించని పాలన ఎందుకోసం?

- చొప్పదండిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



జగిత్యాల: పొలంలో నిరసన వ్యక్తం చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, రైతులు, నాయకులు